బరువేళ్ళి మొసంచేసి...!

బొల్లిముంత నాగేశ్వర రావు

ఆ రోజు ఆఫీసు వాతావరణం అదో రకంగా ఉంది చాలా మంది ముఖాల్లో ఒకవిధ తృప్తి ఎవరికి వారు పెద్ద అనుభవం ఉన్నట్టు గంభీరంగా సీట్లలో కూర్చుని పనులు చేసుకుంటున్నారు రాజారావు నున్నగా గడ్డం గీయించి నీట్‌గా డ్రస్సప్ అయ్యాడు ప్రక్క సీట్లో ఉన్న ముకుందరావు అది కనిపెట్టాడు!

ముకుందరావు అంతకు ముందే జుట్టు ముందుకు దువ్వి కొద్దిగా కనిపించే బట్టతలను కప్పుసుకున్నాడు ముఖాని కున్న కళ్ళ జోడు మాట మాటకీ సవరించు కుంటున్నాడు. కాస్సేపు ఫైలు వంక చూస్తూ, అంతకంటే ఎక్కువ సేపు పైన తిరుగుతున్న ఫాను వంక చూస్తూ- ఆలోచిస్తున్నట్టూ, అది అందరూ చూడాలన్నట్టు చూస్తూ. అప్పుడప్పుడటూ, ఇటూ చూస్తూ పదేపదేగా అదేపనిగా అయోమయంగా ఆవేదన పడుతున్నాడు

ఆఫీసు సూపరింటెండు గోపాలస్వామి తన క్రింది గుమస్తా లంతా అలా బుద్ధిగా సీట్లు వదలకుండా పని చేసుకుంటున్న వాతావరణం- వింత అనుభూతిని కలిగించింది

సీనియర్ గుమస్తా పరమేశం అప్పుడే సీట్లో కొచ్చి కూర్చున్న సునీతకు పై అధికారి ఆదేశం మేరకు పని నేర్పుతున్నాడు! సునీత శంకరం భార్య శంకరం మరణవార్త పేపర్లో పడలేదుగాని పేపర్లలో కనిపించే పెద్దవారి మరణమే శంకరానికి ప్రాప్తించింది శంకరానికి హఠాత్తుగా గుండె ఆగిపోయింది!

గుండె ఆగిపోవటం మీద ప్రముఖులైన డాక్టర్లు పలురకాలుగా చెప్తారు పొగత్రాగటం గుండె జబ్బుకి ప్రధాన కారణమైతే శంకరం ఎప్పుడూ పొగత్రాగేవాడు కాదు మద్యపానం గుండె ఆగటానికి మరో కారణమైతే శాస్త్రం సమ్మతించిన చిట్టి పొట్టి పార్టీల్లో కూడా చిన్ని చుక్క ఆల్కహాల్ కూడా సహచరులు బలవంతం చేసినా నాలుక చివర కూడా రాసుకుని ఎరుగడు!

కొవ్వు పదార్థాలు వాడటం, కొలెస్ట్రాల్ రక్తంలో పెరగటం గుండె పనికి వేరే ఆటంకమైతే అద్దె చెల్లించటానికి ఆముదం ఖర్చులకీ ఎల్టీ బస్సు చార్జీలకీ చింతపండు పెరిగిన ధరలకీ, ఉల్లిపాయ ఉబ్బిన ధరలకీ కొబ్బరినూనె కొవ్విన ధరలకీ ఇస్తున్న జీతం ఎలా తెలా పోయినప్పుడు నేతి చుక్క నింగినంటి శంకరం నాలుక మీద పప్పు చప్పగా మిగిలిపోయేది!

మరి శంకరానికి గుండె ఎందు కాగిపోయినట్టు??

గుండె ఉంది గనుక ఆగిపోయింది! సాదా గుమస్తా విషయంలో సరిపెట్టుకోవాల్సింది అదే అయినా సునీత సరిపెట్టుకోలేక పోయింది తననెంతగానో ఆరాధించిన శంకరం- తనను చూసి పైసా కట్నం కూడా అడక్కుండా పెళ్ళి చేసుకున్న శంకరం-తనకు సర్వస్వమూ అనుకున్న శంకరం- తీపి గుర్తుగా ఓ ఇద్దరు పిల్లల్ని మిగిల్చి ఇలా మధ్యంతరంగా తన నుండి మాయమై పోవటం తలుచుకున్నప్పుడల్లా తల్లడిల్లిపోతుంది

సునీత అందంగా ఉంటుంది ఎర్రగా ముఖం కోలగా, ముక్కు తీరుగా ముఖానికి చాలినంత చారుగా ఉంటుంది! కళ్ళు పెద్దవిగా ఉంటాయి కాలేజీలో చదివేప్పుడు చాలామంది కుర్రవాళ్ళు ఆమె వంక కొంటెగా చూసేవాళ్ళు! మధ్యతరగతి అసహాయత ఆమె చదువును మధ్యలోనే మాన్పించటంతో కప్పల్ని కోసే ప్రయోగశాల నుండి కూరగాయల్ని తరిగే వంటశాలలోకి ఆమె బ్రతుకు మలుపు తిరిగింది!

సునీతకో అన్న ఉన్నాడు దూరంగా ఎక్కడో మిలటరీలో- వార్ధక్యం పైబడిన తండ్రి ఉన్నాడు భారంగా బ్రతుకు బండిని లాగుతూ- వంగిన నడుము, వడలిన శరీరం- సమస్యల జీవనం అడకత్తెరలో సగం చనిపోయిన అమ్మా! 'సునీతకు పెళ్ళి చేసుకోక తప్పలేదు మిలటరీ అన్న నుండి ఆర్థిక సహాయం ఆగిపోయింది సాహార్థిక సంబంధాల్ను తోడివాళ్ళ నుండి వీగిపోయాయి అరవై ఏళ్ళ వరకూ ఎప్పుడో తండ్రి చేసిన ప్రయివేటు యాజమాన్యంలోని పంతులుగిరీ ఉద్యోగానికి- పింఛనుగా వచ్చే నూట ఇరవై రూపా యిలూ వంటి క్రిందకో మెతుకూ, కంటి మీదికో కునుకూ పరిపూర్తిగా యివ్వలేక పోతున్నాయి!

సమయానికి శంకరం వచ్చాడు సునీతను చూశాడు మధ్యలో ఆగిన కాలేజీ చదువూ, మనిషి అందంగా, మధురోహల చందంగా కనిపించింది

వివాహం మీద శంకరానికో విశిష్టమైన అభిప్రాయముంది!

జీవన భాగస్వామిని డబ్బు లడగటమేమిటి? ఆమె పిల్లగా ఈ భూమి మీద జన్మించినపుడు లేని కట్నం- తల్లిగా మరొకరికి జన్మ యిచ్చేప్పుడు లేని కట్నం- అత్తగా మారినప్పుడు లేని కట్నం- ముత్తయిదువుగా బయటికి పోయినప్పుడు లేని కట్నం, భార్యగా పారాణి పాదాలొత్తి, వచ్చిని

తోరణాల క్రిందుగా, బ్రతుకు పసందుగా ఆమె వచ్చేప్పుడు ఆడగటమేమిటి?

ప్రకృతిలో ఏ జీవి అడిగింది గనుక?

జత కట్టిన హంసలు స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరేప్పుడూ, బ్రతుకు జంటల్ని కూర్చుకుని పిచ్చుకలు గూళ్ళకు చేరేప్పుడూ, ప్రేమైక జీవనంలో జంతు ప్రపంచం పరవశించేప్పుడూ, ఏధరవాటికి మధ్యగా నిలిచింది? ఏ కట్నం వాటికి అడ్డుగా వెలిసింది?

శంకరం ఆలోచించేవాడు ఆలోచించిన తర్వాతే అతడు ఆచరించాడు ఆచరించిన మొదటి రాత్రి సునీత అతని వడిలో తలవాల్చి అడిగినప్పుడు తను ఆలోచించిన దాన్నే చెప్పాడు

అతని ఊహల్ని విన్న సునీత కాస్సేపు అవాక్కైపోయింది

'ప్రేమించటానికి పురుషుని కుండాల్సిన అర్హత లేమిటి?'

ఎప్పుడో ఒక మిత్రురాలడిగిన ప్రశ్నకు అప్పట్లో తానేం సమాధానం యివ్వలేకపోయింది ఇప్పుడు తన భర్తను ఏకాఏకిని తీసుకుపోయి—

'ఇదిగో ఇటు చూడండి—' ప్రేమకు నిజమైన ప్రతీక ఈ పురుషుడు ఇతని ప్రేమ ఆకాశం కంటే విలువయ్యింది సముద్రం కంటె గంభీరమయ్యింది పూవు కంటే సుకుమారమయ్యింది భూమి కంటే బరువయ్యింది

ప్రేమమందిరాలక్కర్లేదు—

ఇతని పవిత్ర హృదిలోని స్వచ్ఛమైన అనురాగం వెదజల్లిన ఒక అనుభూతి చాలు' అంటూ



చూపించాలనుకుంది' కానీ ఆమె అతన్ని ఎవరికీ చూపించలేదు ప్రేమావేశంలో అతని సహజ అనురాగాల్ని ఆమె తనలోనే దాచుకుంది' అవి ఎవరికీ కనిపించగూడదని తనే సర్వస్వం దోచుకుంది'

కాలం విరసాత్మకమయ్యింది'

వసంతంలో కమ్మగా పాడిన కోయిల గ్రీష్మంలో మూగబోతుంది' వెలుగుల సౌదాంత రంగంలో కటిక చీకట్లు రాసుల్ని గుమ్మరిస్తుంది'

సునీత విలవిల్లాడింది చీకటి రెండు రకాలు' రాత్రి చీకటి చల్లగా ఉంటుంది బ్రతుకు చీకటి భయంకరంగా ఉంటుంది' భయంకరమైన చీకటిని భరించటం ఎలాగో తెలీక సునీత ఏడ్చింది' కన్నీరు మున్నీరుగా విలపించింది'

శంకరం తోటి గుమస్తాలు వచ్చారు'

ఆమెను ఓదార్చారు ఎవరికి తోచిన సాయం వారు చేస్తామన్నారు ఒకనెల గడిచింది సునీత జిల్లా అధికారికి తన దయనీయ గాధను తెలుపుకుంది ఆయన అర్హతలన్నీ పరిశీలించాక సునీతకు భర్త ఉద్యోగాన్నే యిచ్చాడు

బ్రతుకులో ఏదో వెలితి' ఆర్థికంగా పూడినా ఆత్మీయంగా శూన్యమయ్యింది' ఇంతటి ప్రపంచంలో తిరుగుతున్నా ఒంటరితనం వెంటాడుతుంది' బస్సులో ఎక్కినప్పుడూ, బజారులో తిరుగుతున్నప్పుడూ, రెస్టారెంటులో కాఫీ త్రాగేప్పుడూ, సినిమా హాలు ప్రక్కగా నడిచేప్పుడూ ఏదో బాధ' బరువుగా మూల్గిన గుండె చప్పుడు భరించరానిదిగా ఉంటుంది'

ఇన్నాళ్ళు బ్రతికినా బ్రతకటం గురించి నేర్చుకోలేదు ఇకముందు ఎన్నేళ్ళో బ్రతకటం గురించి నేర్చుకోవాలి'

ఇది తనకు ఆఫీసులో కూర్చున్న మొదటి రోజు' అంతా ఆదరంగా పలుకరించారు తనకంటూ ఒక సీటు చూపించారు ఇంతకు ముందు ఇదే సీటులో తన భర్త పని చేసేడు ఇప్పుడు తను పని చేస్తుంది' విచిత్రమైన మార్పులో వింతగా మలుపు తిరిగిన జీవితం' సునీత ఊహించుకుంది' అప్రయత్నంగా కళ్ళ వెంట నీరు తిరిగాయి ప్రక్కనున్న పరమేశానికి కనిపించకుండా తుడుచుకుంది' ఎదురుగ్గా ఉన్న ముకుందం అది గమనించాడు అతనికి మనసులో కొంచెం బాధ కలిగింది' కళ్ళజోడు సవరించటమూ, క్రాపు సరిచేసుకోవటమూ తగ్గించాడు

ఆ రోజంతా ఆమె సీట్లో యాంత్రికంగా గడిపింది పరమేశం వ్రాయమంటే వ్రాసింది చదవమంటే చదివింది' చదివింది వివరిస్తే వింది'

★ ★ ★ ★

ఆఫీసులో సునీతకు రమాదేవి పరిచయమయ్యింది రమాదేవి టైపింగ్ సెక్షన్లో పని చేస్తుంది

తన కంటె చిన్నదైనా ఆమె మాట్లాడే విధానం సునీతకు నచ్చింది మనిషి స్మార్ట్‌గా ఉంది చామనచాయలో ఆకర్షణీయంగా ఉండే ముఖం' ఇటీవలే వివాహం అయ్యింది భర్తకేదో బిజినెస్ రెండు చేతులా సంపాదన' పైగా ఆమె కూడా తనుండే పండరీపురంలోనే కాపురం' దారిలోనూ, ఆఫీసులోనూ మనసు విప్పుకుని మాట్లాడే ఒక తోడు'

సునీత ఆనందపడింది'

'ఒరులేయవి యొనరించిన...'

2

ఆఫీసులో సునీతకు రోజులు గడిచి పోతున్నాయి కొద్ది కొద్దిగా పని అర్థమవుతుంది పరమేశం పని నేర్పుతున్నాడు పని నేర్పే పరమేశంలో ప్రతిరోజూ ఏదో మార్పు!

మొదట్లో అమ్మా అని పిలిచిన పరమేశం ఇప్పుడు ఏమండీ అంటున్నాడు అమ్మ"లో ఉన్న ఆప్యాయత 'ఏమండీ' గా ఎందుకు దూరమయ్యిందో సునీతకు అర్థం కాలేదు కానీ అప్పుడప్పుడు సునీతకు అర్థమవుతుంది!

తనను చూసి చిన్నగా నవ్వినప్పుడూ, ఫైలు తననుండి అందుకొనే సమయంలో చేతుల్ని తాకు తున్నప్పుడూ, చేతుల్ని తాకినప్పుడు కూడా చిన్నగా నవ్వుతున్నప్పుడూ !

శ్రుతి మించుతున్న ప్రవర్తన - సునీత భరించలేక పోతుంది! పని నేర్చుకోవాలంటే భరించక తప్పదనుకుంది ముందుగానే ఒక సీనియర్ క్లర్కుతో పేచీ పడటం మంచిది కాదనుకుంది విషయాన్ని మరో విధంగా మలిచి, తనను వేరే విధంగా నవ్వులపాలు చెయ్యటానికి అవకాశ ముంటుందని భయపడింది!

అతడెలా కవ్వించినా తను చలించగూడదు!

తన సెక్షన్‌లో తను ఒక్కర్తే ఆడమనిషి మరొకరున్నా బాగుండేది

పరమేశంతో పాటు ఇతర గుమాస్తాల చూపులు కూడా రోజు రోజుకీ మారుతున్నాయి సానుభూతిగా చూసిన కళ్ళు ఇప్పుడు చిలిపిగా చూస్తున్నాయి

మారుతున్న తేడాను సునీత గమనించింది!

ఎవరికీ చెప్పుకొనే సమస్య కాదు మనసును దహించే సమస్య!

ఈ ప్రపంచ మొక వైకుంఠపాళీ! తన లాంటివాళ్ళు పావులు పైకి తీసే నిచ్చెనలూ ఉంటాయి పైనబడే పాములూ ఉంటాయి ఆలోచించి అడుగు వెయ్యాల్సిన అవుసరం తనది! ప్రమాదమనుకున్న చోట నుండి అడుగులు తీయాల్సిన అవసరం కూడా తనదే

ఈ ఆఫీసులో

'చెల్లెమ్మా అని పిలిచే ఒక సోదరుడుంటే ఎంత బాగుంటుంది ఆ పవిత్రమైన పిలుపు తన కెంత చేయూత నిస్తుంది

తన నలా పిలవేమని ఎవరి నడుగుతుంది! సునీత కళ్ళు అప్పుడప్పుడు చెమర్చేవి!

ఈ దేశ సరిహద్దుల్ని కాపాడుతూ ఎక్కడో ఉన్న అన్న తనకీ సమయంలో ఏం ఉపయోగపడడు. జీవితం నైతిక సరిహద్దుల్ని కాపాడే మరో అన్న తన కిక్కడ కావాలి!

సునీత అందరి వంకా చూసింది! కానీ ఎవరూ తన నలా పిలిచేట్టు లేరు అందుకే లంచ్ అవర్‌లో సునీత బయటికి పోలేక పోయింది అలాగే వ్రాసుకుంటూ ఉండిపోయింది అర్జెంటు ఫైలు పని అర్థం కావటం లేదు ఈలోగా పరమేశం అక్కడికి వచ్చాడు వస్తూనే చిరునవ్వు నవ్వాడు అతని అవుసరం ఆ సమయంలో ఉంది! అతన్ని చూడగానే ఒకవిధమైన ఆనందం కానీ మరేదో భయం!

తన పనిలో సందేహాలు తీరుస్తాడు కానీ బ్రతుకులో సందేహంగా మిగులుతాడు

ఏమండీ ఏమిటి వ్రాస్తున్నారు? పరమేశం ముందుకొచ్చి కుర్చీ లాక్కొని కూర్చున్నాడు

తను వివరించింది అర్థంకాని విషయాన్ని అడిగింది పరమేశం చెప్పాడు తను వేరె కాగితం మీద నోట్ చేసుకుంది

మీరు లంచ్ అవర్‌లో కూడా ఇలా బయటికి రాకుండా పని చెయ్యాల్సిన పని లేదు మనమిలా కుర్చీకి మొత్తంగా అతుక్కుపోయి యంత్రంలా పని చేస్తే బ్రతుకు పరమ బోర్‌గా తయారవు తుంది థ్రిల్ ఉండదు అలా బయటికి పోయి- కాంటీన్‌లో కాఫీ సిప్ చేసి పదిమంది తోనూ పరిచయం పెంచుకోవాలి ఈ రోజు రమాదేవి రాలేదను కుంటాను పరమేశం అన్నాడు

"రాలేదు' తను సమాధానం చెప్పింది

"ఆమె వస్తే మిమ్ముల్ని ఈ సమయంలో ఇలా ఒంటరిగా వదిలేది కాదు అవునా?" పరమేశం నవ్వాడు

అవును " తనూ చిన్నగా నవ్వింది!

"అసలు మీరీ మధ్య ఒంటరిగానే కనపడటం లేదు పరమేశం ఏదో రహస్యం చెప్తున్నవాడిలా టేబుల్‌పైకి వంగి అన్నాడు

ఎందుకు?"

'ఏం అంత అమాయకంగా అడుగుతావ్?' పరమేశం నవ్వాడు అది మనిషి వక్రించిన వికారంలోని ఒక వెకిలి నవ్వు! సునీత భరించలేక పోయింది

నవ్వుతూనే పరమేశం మరో పని చేశాడు టేబుల్ క్రింద చెప్పులోంచి బయటికి తీసిన పాదంతో , సునీత పాదంపై ఉంచి నొక్కాడు సునీత తన పాదాన్ని బలవంతంగా ప్రక్కకు లాక్కుంది అక్కడి నుండి మెల్లిగా లేచింది

''తలనొప్పిగా ఉందండీ! కాఫీ త్రాగాలి' అంది

"అంతకంటేనా పదండి ' పరమేశం కూడా లేచాడు

ఇద్దరూ బయటికి నడిచారు కాంటీన్ సమీపించారు పరమేశమే రెండు కాఫీలు ఆర్డర్ యిచ్చాడు

సునీత ముఖంలోని భావ సంఘర్షణ- ఆవేదన పరమేశం గమనించాడు అది స్త్రీకి సహజమె అని సరిపెట్టు కున్నాడు. మొదట్లో కొంత బాధపడు తుందనీ, తర్వాత మెత్తబడుతుందనీ అతని ఆలోచన!

సాధించవలసిన విజయానికి మొదటి మెట్టు ఎక్కిన వాడిలా అతడు సంతోషపడ్డాడు ఏమాత్రం ఇష్టం లేకపోయినా సునీత ప్రవర్తన మరోవిదంగా ఉంటుంది తను ప్రయోగించిన పాదబాణం పూలబాణంలా మారేక్రమంలో ఇప్పుడు ఆమె ఉంది ఈ పరిస్థితిని రోజుకో విదంగా మలుచుకుని అభివృద్ధిని సాదించుకోవాలి అది సాదించ గలిగిన రోజున తనకు మరో జీవితం- జీవితానికి మరో తీయని మలుపు!

పరమేశం తృప్తిగా గాలి పీల్చి వదిలాడు అక్కడున్న అందరి గుమస్తాల కంటే తను అదికుడుగా బావన చెందాడు

కాంటీన్ దగ్గర సునీత పరమేశం దగ్గర సెలవు తీసుకుని బయటికి పోయింది పరమేశం కాస్సేపు తోటి గుమస్తాలతో కబుర్లు చెప్పి తన సెక్షనుకు చేరేడు- అక్కడ సునీత సెలవుపెట్టి ఇంటికి పోయిందని తెలుసుకున్నాక అతనికి కొద్దిగా ఆశ్చర్యం వేసింది కొంత ఆందోళన కలిగింది

'సాయంత్రం అయ్యాక తనూ సునీత ఇంటికి పోతే ' మనసులో అనుకున్నాడు తర్వాత ఈ రోజు వద్దని నిర్ణయించుకున్నాడు, రేపు కూడా ఆమెను పరిశీలించాలి అప్పుడు మరో అడుగు ముందు కెయ్యవచ్చు!

* * * *

మరునాడు కూడా సునీత ఆఫీసుకు రాలేదు పరమేశానికి విషయం అర్థం కాలేదు సునీత ఒకవారం పాటు సెలవు పెట్టినట్టు రమాదేవి సెక్షన్ సూపరింటిండెంటుకు లీవ్ లిటరు అందించింది.

ప్రారంభంలోనే ఇలా సెలవులైతే ఎలా? మీరు కాస్త ఆమెకు వివరించండి. ఇదంతా "లాసాఫ్ పే" క్రిందకు పోతుంది" సెలవు దరఖాస్తు తెచ్చిన రమాదేవి దగ్గర గోపాలస్వామిగారు నొచ్చు కున్నాడు

రమాదేవి సమాధానం మాత్రం యివ్వలేదు. మౌనంగా తన సెక్షన్‌కు పోయింది లంచ్ అవర్‌లో పరమేశం రమాదేవిని సెలవు కారణం అడిగాడు. ఆమె తనకేమీ తెలీయదనీ, అనారోగ్యం ఫీలవు తున్నట్టు మాత్రం చెప్పిందనీ సమాధానం చెప్పింది

పరమేశానికి కొద్దిగా అయోమయ మయ్యింది!

ఆలోచనలో పడ్డాడు సునీత ప్రవర్తన అతనికేమీ అర్థం కాలేదు

ఇంటికి పోయి కనుక్కుంటే

తను చేసిన దానికి తనను చూసి అసహ్యించు కుంటే

పరమేశం మరోసారి ఆ ఆలోచన్ని విరమించు కున్నాడు

వారం గడిచాక మరలా రాకపోతుందా? తనతో అవుసరం లేకపోతుందా?" సునీత ఆకారాన్ని

ఊహించుకుంటూ అతడు చిన్నగా నవ్వుకున్నాడు!

3

అది పరమేశం ఇల్లు ఆదునికమైన కొన్ని సౌకర్యాలు అందులో అమిరి ఉన్నాయి సాయంత్రం ఆరు గంటలయ్యింది పరమేశం ఆఫీసు నుండి వచ్చి, వరండాలోని సోఫా మీద కూర్చున్నాడు పై కప్పు కమర్చిన ఫాను తన రెక్కలతో గాలిని విసరుతుంది శ్రీమతి అందించిన కప్పులోంచి టీ మెల్లిగా చప్పరిస్తూ, రాష్ట్రంలోని రాజకీయ సందడిని రేడియోలో వింటూ పరమేశం పరమానందం అనుభవిస్తున్నాడు పదవి కోసం ఆర్భాటాలు రేడియోలో వినిపిస్తున్నాయి పెదవి కోసం ఆరాటం తన గుండెలో ధ్వనిస్తుంది సునీత సెలవు పెట్టి మూడో రోజు –

పరమెశం టీ పూర్తి చెసి ఖాళీ కప్పు ప్రక్కనే పెట్టాడు అతని మనసు నిండా సునీత రూపం నిండివుంది ఒకసారి తన బార్య రూపంతో సునీత రూపాన్ని పోల్చుకున్నాడు ఎంతో తేడా? గడిపిన గత కాలం అసంతృప్తి – మరలా వెంటనే సునీత అందుతుందేమో నన్న ముందు కాలం తృప్తి – అతన్ని ఒకేసారి పెన వేశాయి విచిత్రంగా నవ్వుకున్నాడు

ఆ సమయంలో అతని మనసులో శంకరం మెదిలాడు ఆఫీసులో ఎంతో సిన్సియర్‌గా పని చేసేవాడు ఏ సీట్లోనూ ఎప్పుడూ ఎవరినుండీ పైసా ఆశించి ఎరుగడు మితంగా మాట్లాడేవాడు తాము జేబుల్ని నింపుకుని ఇళ్ళకు పోయే ముందు తృప్తి పడేవారు అప్పట్లో ఈ శంకరానికి తృప్తి ఏదీ అనుకోవటం జరిగింది అదిప్పుడు తెలిసింది శంకరం ఇంటికి పోయినాక సునీతను చూసుకు తృప్తి పడేవాడని

శంకరం తృప్తి ఎంత గొప్పది!

ఇప్పుడా సునీత తనకు దక్కితే– బ్రతికినందుకు తను రెండు సాధించుకున్న వాడవుతాడు పైసలు జేబులు నిండే పదవి. మరో పదిహేనేళ్ళుంటుంది రెండోది పరవశించే పెదవి జీవిత కాలం ఉంటుంది తోటి గుమస్తాలంతా తనను చూసి ఈర్ష్య పడతారు. "పెద్దిల్లు – చిన్నిల్లు" అంటారు పెద్దింటిని తను పోషించాలి చిన్నింటిని చిన్నిల్లే పోషించు కుంటుంది

పరమేశం పరమానందంలో తేలిపోతున్నాడు

ఆ రోజు శ్రీవారు పరధ్యానంగా పరవశించటం ఆయన శ్రీమతికి ఎంతగా కనిపించింది కళ్ళు సగం మూసుకున్నాడు పెదాల మీద చిరునవ్వు మెరుపులా వచ్చి మాయమవుతుంది మనిషి మొత్తం సోఫా మీద వెనక్కి వాలిపోయి ఈజీగా కూర్చున్నాడు

సాయంత్రం ఆరున్నర!

పరమేశం పందొమ్మి దేళ్ళ కూతురు తుఫానులా ఒక్కసారి ఇంట్లోకి దూసుకొచ్చి చేతిలో ఉన్న పుస్తకాల్ని వరండాలో విసిరి కొట్టింది. నేలమీద చెల్లా చెదురుగా అవి పడిపోయాయి ఆమె ముఖం కందగడ్డలా, కళ్ళు ఎర్రగా మారెయి జుట్టు చెదిరి పోయింది మనిషిలో ముచ్చెమటలు కనిపిస్తున్నాయి నొసటి మీద దిద్దుకున్న తిలకం చెదిరి ఇటూ, అటూ అయ్యింది .

కుమార్తె ప్రదర్శించిన ఈ హఠాత్ పరిణామానికి పరవశిస్తున్న పరమేశం పూర్తిగా కళ్ళు తెరచి బిత్తరపోయేడు

'ఏమిటమ్మా లతా! ఏమిటే?' అడిగాడు

లత పెరుకు తగ్గట్టు లావుగా కాకుండా లతలా వుంటుంది కళ్ళు విశాలంగా, ముక్కు బారుగా, పెదాలు ఎర్రగా, నడుం సన్నగా, ప్రబంద నాయకిలా చలాకీగా చురుగ్గా, వేడిలా చెరుగ్గా, మందస్మితలా మనిషి అకర్షణీయంగా ఉంటుంది ప్రతి సబ్జెక్టులోనూ ప్రధమంగా, వ్యాసరచన, వక్తృత్వం, నాటికల పోటీల్లో విజేతగా వస్తుంటుంది!

పదిమంది అమ్మాయిలకు ముందు నడుస్తుంది వందమంది సమస్యల్ని తన సమస్యగా బావిస్తుంది ఎక్కడ ఏ అన్యాయం జరిగినా నేరుగా ముందుకుపోయి పరిష్కార సాధనలో బహుముఖాలుగా పని చెస్తుంది!

అలాంటి లత– తన కేదో అన్యాయం జరిగినట్టు, ఒక్కసారి తండ్రి ప్రక్కన కూర్చుని, ఆయన వడిలో తల పెట్టి వెక్కి, వెక్కి ఏడవటం మొదలెట్టింది!

'ఏమిటి చెప్పమ్మా' పరమెశం కంఠంలో మరింత ఆందోళన

'నేను కాలేజీకి వెళ్ళను నాన్నా!' ఈసడింపుగా అన్న మాటలు అతనికి మరింత ఆవేదన్ను కలిగించాయి

'అసలేం జరిగింది?' అనూహ్యమైన సంఘటన ఏదో వినవలసి వస్తుందని అయోమయంగా, ఆవేశంగా పరమేశం అడిగాడు

'ఏం చెప్పమంటావ్ నాన్నా!' దుఃఖావేశం కంఠంలో తొంగిచూసినపుడు, ఎవరో రోడ్డు మీదుగా పోయే మనుష్యులు తమవైపుకు వంగిచూసినపుడు, భరించలేని లత భయంగా, బరువుగా అక్కడినుంచి లేచి ఇంట్లోకి దారితీసింది!

పరమేశం కూడా కూతురివెంట ఇంట్లోకి నడిచాడు అతని గుండె వేగంగా స్పందించటం మొదలెట్టింది క్షణకాలం క్రితంలోని తనతీయని తలపులకు తలుపులు మూసకు పోగా, తన ఇంటి తలుపులు కూడా మూసుకుని లత ఏం చెప్తుందో అన్న ఆవెదనగా, ఆందోళనగా, ఆక్రోశంగా పరమేశం మనసు తత్తర పడిపోతుంది!

'అది కాలేజీయా నాన్నా నో ' లత కరుగ్గా అరిచింది!

'అదేమిటమ్మా కాలేజీ అనేగా పంపింది!' పరమేశం వణికిపోతూ అన్నాడు అదేసమయానికి లత తల్లి కూడా వచ్చి 'ఏమిటండీ, ఏం జరిగింది?' అంటూ నిలబడి పోయింది అలా నిలబడిన తల్లిమీద లత తలవాల్చి కొన్సేపు ఏడ్చింది! పరమేశమూ, ఆయన భార్యా శిల్పా ప్రతిమల్లా అలాగే ఉండిపోయారు

లత తల్లి మీదినుంచి లేచి కళ్ళు తుడుచుకుంది!

'నాన్నా! మా లెక్చరర్ ఉమాపతిగారు'

'ఆ ఉమాపతిగారు చాలామంచి లెక్చరర్– బాగా చెప్తారంటివిగా'–

'ఎంత బాగా చెప్తే ఏం లాభంనాన్నా! బుద్ది అంత వక్రంగా ఉంటుందని తెలీదు'

'ఏం చేశాడమ్మా'

'నన్ను తనలాబ్ లోనికి రావలసిందిగా అటెండర్ చేత కబురు చేయించాడు నాన్నా! ఆయన మీద ఏ అనుమానమూ ఎవరికీరాదు నేను మామూలుగానే పోయాను వెళ్ళటంతోటే తలుపులు బిగించాడు. మెల్లగా దగ్గరకొచ్చి,

'మై డియర్ బ్యూటిపుల్ లతా! నీరూపం నన్ను నిద్రనుంచి దూరం చేస్తుంది నీ స్పర్శ లేకుండా



ఇకముందు ఈ బ్రతుకు బారం చెస్తుంది ప్లీజ్ ' అంటూ ముందుకొచ్చి చేతిని పట్టు కున్నాడు దగ్గరగా లాక్కొని ముద్దెట్టు కున్నాడు నేను భయపడి పోయెను అరిస్తే పరువుపోతుంది కరిస్తే మరోరకంగా పరిణమిస్తుందని మెల్లిగా ఆయన పట్టు నుండి బయటపడి–

'అదేమిటిసార్' తండ్రిలాంటివారు మీకు బార్య ఉంది పిల్లలున్నారు నన్ను చూసి అలా చలించటం అసభ్యతసార్ ' అంటూ బయటికి పారిపోయి వచ్చాను ఎవరికీ చెప్పలేదు మరలా ఆయన క్లాసుకొచ్చి నపుడు ఏమీ జరగనట్టే ప్రవర్తించాను ఆడదాన్ని కదానాన్నా, పురుషాధిపత్యం ఏలుబడి చెస్తున్న ఈ సమాజంలో ఒక్కొక్కసారి సున్నితంగా తప్పుకోవాలి ఒక్కొక్కసారి కర్కశంగా, కసాయిగా పైనబడి పీకాలి అందుకని ఇప్పట్లో నేను కాలెజీకి వెళ్ళలేనునాన్నా ' అంటూ సునీత మరలా ఏడ్చింది

'అయినా నాన్నా, ఆయనదదేం బుద్ధి' నలుగురికి చెప్పాల్సిన మనిషి, సంస్కారం ఊపిరిగా బ్రతకాల్సిన మనిషి, సహధర్మ చారిణి తప్ప సహచార దర్మానికి మరోస్త్రీని మనసులో కూడా ఊహించగూడని మనిషి, పవిత్ర ఆలయాల్లో నైతిక విలువల పీఠాల మీద నిటారుగా నిలబడాల్సిన మనిషి, వెలుగుల్ని ఎదుటి మనసుల్లోకి వెదజల్లాల్సిన మనిషి, విజ్ఞానమే తపస్సుగా బ్రతకాల్సిన మనిషి, ఇలా చీకటి కోణాల్లోని చిలిపి వికారాలకు లోనయ్యాడేమిటి?' అని లత తండ్రి వంక దీనంగా చూసింది

'ఊరుకో అమ్మా– పాడు ఎవరైనా వింటే నవ్విపోతారు ఎదిగిన పిల్లలకు అవేనా నేర్పేది– అదేం బుద్ధి?' ఆమె తల్లి సముదాయించింది'

పరమెశం ఏదో బలమైన గాయం నెత్తిమీద తగ్గిలినట్టు బయటికి వచ్చాడు అతనికేం చెయ్యాల్సిందీ తోచలేదు సోఫామీద కుప్పగా కూలబడ్డాడు

ప్రక్కింటి పది సంవత్సరాల 'బాబ్జీ', పరమేశమంటే చనువుగా ఉండే బాబ్జీ పరమేశాన్ని మావయ్యా అని పిలిచే బాబ్జీ పరిగెత్తుకుంటూ వచ్చాడు వాడిచేతిలో వార్తాపత్రిక ఉంది వాడిముఖంలో సంతోషం ఉంది వాడెగురుతూ,

'ఇదెమిటి మావయ్యాయ్' మీ పెద్దోళ్ళ పేపర్లో మా పిల్లల పుస్తకంలోని పద్యముంది దీన్ని మీరూ నేర్చుకుంటారా?' అంటూ పద్యం చదవటం మొదలెట్టాడు

'ఒరులేయవి ఒనరించిన పద్యం పూర్తి చేశాడు

పద్యం తాలూకు భావం పరమెశం మనసులో మెదిలింది' అతని మనసు బాధగా మూల్గింది'

ఆ సమయంలో అతనికి సునీత గుర్తుకు

లైఫ్

కాలేజీ లైఫ్ ప్రారంబం'
గైరు హాజరు ప్రారంభం'
పుడుతుంది సినిమాలపై మోజు'
పడుతుంది పుస్తకాలకు బూజు'
బయలుదేరుతారు ఇంటి ఎద్ద'
హాజరవుతారు సినీ హాలు వద్ద'
కొడతారు గుళ్ళో టెంకాయ'
త్రిప్పుతారు పరీక్షల్లో తలకాయ'
పాసవుతాలే అంటారు అందరూ'
పేపరులో చూస్తే వుండదు నంబరు'

— ఆషాలత

'ఒరులేయవి యొనరించిన....'

వచ్చింది' తను చెసనపనే ఒక లెక్చరర్ చేసెడు

లత ఎదురు తిరిగి మాట్లాడింది

సునీత మాట్లాడ లేక పోయింది

లత తండ్రి వడిలో తలదాల్చి ఏడ్చింది తను ఓదార్చేడు కానీ సునీత తండ్రి వడిలో తలదాల్చి కన్నీరు కార్చి తన అయిష్టతను ఆవేశంగా చెప్పటానికి అవకాశంలేని పరిస్థితి'

ఎవరు ఏది చెస్తే తనకు ఆవేదన కలిగిందో – అది తను మరొకరికి చేసెడు అలా చెయ్య కుండా ఉండటమే పరమదర్మమని పద్యం చెప్తుంది

పద్యం మెల్కొలిపిన చైతన్యానికి పరమెశం కదిలిపోయెడు వెంటనే ఇంట్లోకి పోయి డ్రస్సు మార్చుకున్నాడు అతనికళ్ళు ఎర్రగా మారి నీటిని వర్షిస్తున్నాయి తల్లీ, కూతురూ ఒకదరిని మౌనంగా ఉండిపోయేరు

పరమెశం నేరుగా సునీత ఇంటికి పోయేడు' అతని రాక సునీతకు ఆశ్చర్యాన్ని కలిగించింది

'ఏమిటిలా వచ్చారు?' అడిగింది'

'నిన్నటి వెకిలిపరమేశం చచ్చిపోయేడని చెప్పటానికి వచ్చానమ్మా' ఇవ్వాల్టి నీ సోదరుడు పరమెశం– నిన్ను చెల్లెమ్మా అంటూ పిలిచి, ఆఫీసుకు ఎందుకు రావటం లేదో అడిగి పోదామని వచ్చానమ్మా'' అతని కంఠంలో దుఃఖం మనిషి మొత్తంలో ఏదో మార్పు'

సునీత కాస్సేపు అవాక్కై పోయింది ఆమె కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి ఇంతటి మార్పు పరమెశంలో ఎందుకొచ్చింది? ఆమెకు అర్థం కాలేదు కన్నీటని తుడుచుకుని–

'వస్తాను అన్నయ్యా ' ఇక ఆపీసుకు తప్పక వస్తాను ' అంది

★ ★ ★ ★ ★

ఈ వినూత్నమైన అన్నా చెల్లెళ్ళ కళ్ళు చమర్చటానికి ఐదు గంటల ముందు ఉమాపతి లతను తనరూం కు ఎలిచాడు–

' చూడు లతా' నీ ప్రతిభ మీద నాకు విశ్వాసముంది ఒక్కొక్కసారి 'ది చైల్డ్ ఈజ్ ది ఫాదర్ ఆప్ ఎ మాన్' అనే సూక్తి అక్షరాలా నిజమవుతుంది తండ్రుల నుండి పిల్లలు నేర్చుకోవాల్సిన నైతిక విలువల్ని ఎల్లలె అప్పుడప్పుడు తండ్రులకు నేర్పాల్సి వుంటుంది మీనాన్న గారు పని చేసే ఆపీసులోనె మా. చెల్లి రమాదేవి పని చెస్తుంది ఆమెకో స్నెహితురాలు సునీత ఉంది బర్త చనిపోయిన అబల– సంస్కార విహీనమైన పురుషుని స్వార్థం ఆమెను ఇప్పుడిప్పుడే వెదిస్తూంది '

ఆయన నోటి నుండి మొత్తంగా విన్న లత అవమానం పీలయ్యింది అప్పుడాయన లత చేతికో వార్తా పత్రికిచ్చి– పద్యాన్ని చదవమన్నాడు సంపాదకీయం శీర్షిక మీద చిన్ని అక్షరాల్తో ఉన్న ఆపద్యం ఎంత పెద్ద సందేశాన్నిస్తుందో అర్థం చెసుకుంది

అవును– ఆపద్యం ఎంతగొప్పది? మానవ జాతి మొత్తం సుఖంగా మనుగడ సాగించ గల సందేశం – మనిషని మనిషి ఎలా గౌరవించాలో నేర్పే సందేశం – మానవత విలువల్ని మరింత ఉన్నత దశకు తీసుకు పోయె సందేశం, సంకుచిత చీకటి బావాలకు అతీతంగా మనిషి మనుగడను మహోన్నత స్థాయికి చెర్చగల సందేశం, ప్రపంచం నైతిక విలువల సారాన్ని మొత్తం నాలుగు పాదాల్లో ఇరికించిన సందేశం– దానిలో ఉంది

లత అర్థం చేసుకుంది' ఉమాపతి దగ్గర సెలవు తీసుకుంది'

పేపరుతో నేరుగా ముందు బాబ్జీగాడింటికి పోయి– మానాన్నకీ పద్యం చదివి వినిపించరా అంది ఎలా అనాలో–, ఎలాచదవాలో వాడికి నేర్పింది తర్వాత ఇంటికి విసురుగా వచ్చింది'

★ ★ ★ ★ ★

మరుదినం పరమేశంలో వచ్చిన మార్పును సునీత రమాదేవికి చెప్పింది రమాదేవి మరలా తనే అన్నగారికి చెప్పింది ఆ అన్నగారు లతను మరలా తన లాబ్‌కు పిలిపించి విషయం వివరించాడు అందరూ సంతోషపడ్డారు కానీ

నాటకం పతాక సన్నివేశంలో పద్యం కమ్మగా పాడిన బాబ్జీగాడికీ విషయం అర్థంకాలేదు –

అయినా వాడా పద్యం పాడుతూనే ఉన్నాడు–

'ఒరు లేయవి ఒనరించిన ' అంటూ–- □